క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుడు గోవింద్‌కు పీఆర్కే పరామర్శ



దుర్గి: మండల పరిధిలోని కంచరగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కలవల వీర గోవిందరావు(గోవింద్)ను పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల వీర గోవిందరావు తీవ్ర అస్వస్థతకు గురై గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయాన్ని తెలుసుకున్న పీఆర్కే గోవిందరావు స్వగృహానికి వెళ్లి వివరాలడిగి తెలుసుకున్నారు. పీఆర్కే కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ పార్టీ అన్ని విధాలుగా అండగా నిలుస్తుందన్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఎటువంటి సాయం చేయటానికైనా సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. పీఆర్కే రాకను తెలుసుకున్న మండలంలోని పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చిన పీఆర్కేను కలిశారు. అనంతరం తన అత్త మద్దికర హనుమాయమ్మ పెద్ద ఖర్మకు కోలగుట్లలో హాజరై నివాళులర్పించారు. ఎంపీటీసీ బొంతా కృష్ణ, నాయకులు మాదాసు వెంకటేశ్వర్లు, మాదాసు వాసు, గొట్టం బ్రహ్మారెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఆర్కేను కలిసిన నాయకులు..

కారెంపూడి: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పార్టీ మండల నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్, షేక్ ఆరీఫ్, కిల్లా కాశి, బొగ్గవరపు నాగరాజు, జాన్‌పాల్ నాయక్, మిద్దెపోగు ప్రవీణ్, వల్లెపు చినముసలయ్య, అన్నారావు, సయ్యద్ ఫరీద్‌బాబా తదితరులు కలిశారు.

మూడు గ్రామాల్లో పశుఆరోగ్య శిబిరాలు

గురజాల: పశువుల ఆరోగ్యమే ధ్యేయంగా ప్రభుత్వం గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను ఏర్పాటుచేయడం జరిగిందని పశువైద్యులు తెలిపారు. మండల పరిధిలోని పల్లెగుంత, కొత్త అంబాపురం, చర్లగుడిపాడు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను శనివారం నిర్వహించారు. పల్లెగుంతలో జరిగిన కార్యక్రమంలో పశువైద్యురాలు కె.ఉమామహేశ్వరి మాట్లాడుతూ పశువులు ఆరోగ్యంగా ఉంటేనే పశుపోషకులు లాభాలు వస్తాయన్నారు. శనివారం జరిగిన శిబిరంలో 30 మంది రైతులు లబ్ధిపొందినట్లు తెలిపారు. టీడీపీ నాయకుడు జాస్తీ ప్రకాష్, వైద్యులు జె.నాగార్జున దీపక్, సిబ్బంది రామారావు, దుర్గా, మౌనిక, శ్రీనివాస్, లక్ష్మి, వీరాస్వామి, వైష్ణవి, పూజ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపాడులో...

వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడు గ్రామంలో పశువైద్యాధికారి సరిత ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. పశువుల యజమానులకు దాణా, మందులు అందజేశామని సరిత తెలిపారు. టీడీపీ నాయకులు తోట వీరాంజనేయులు, జవిశెట్టి మొద్దయ్య, పశు వైద్యశాల సిబ్బంది, యజమానులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : సీఐ

గురజాల రూరల్ : ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ ఆవుల భాస్కర్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే సమాచారం రావడంతో సీఐ డ్రోన్ సహకారంతో కాలనీని జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జూదం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వంటివి చేయరాదన్నారు. ఆయనవెంట ఎస్‌ఐ వై.వినోద్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

కారెంపూడి తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు నాయక్



కారెంపూడి: కారెంపూడి మండల తహసీల్దార్‌గా ఆర్.వెంకటేశ్వర్లు నాయక్ శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కారెంపూడిలో డీటీగా పనిచేస్తేన్న వెంకటేశ్వర్లు నాయక్‌కు తహసీల్దార్‌గా ప్రమోషన్ వచ్చింది. పోస్టింగ్ కూడా ఇదే మండలంలో ఇచ్చారు. నూతన తహసీల్దార్‌ను పలువురు రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది కలసి అభినందనలు తెలిపారు.

స్టడీ మెటీరియల్స్ పంపిణీ

వెల్దుర్తి: అక్షర దానం జ్ఞానాన్ని పెంపొందిస్తుందని శ్రీ తులసీ ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ మురళీకృష్ణ అన్నారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ పాఠశాల, కేజీబీవీ, ఏపీ మోడల్ పాఠశాల, ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు స్కాలర్ షిప్‌లు అందించడం జరుగుతుందన్నారు. మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని బాగా చదవాలన్నారు. సుమారుగా 300 మంది విద్యార్థులకు మెటీరియల్ అందించినట్లు తెలిపారు.

చేతికందింది.. నోటి కందేనా!

- మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో ఆశాజనకంగా రబీ కంది సాగు
- ఎకరాకు 10–17 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని అంచనా
- అయితే గిట్టుబాటు ధర లేక రైతుల ఇక్కట్లు
- గతేడాది కంటే అనూహ్యంగా పతనమైన ధర
- ప్రభుత్వ మద్దతు ధర పెంచాలంటూ రైతుల వినతి



కాపు దశలో ఉన్న కంది పైరు

కారెంపూడి: రబీలో నీటి పారుదల కింద వేసిన కంది పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. పైర్లు పూత, పిందె, కాయ దశల్లో కనువిందు చేస్తున్నాయి. వేసవిలో పత్తి పంట పూర్తయిన తర్వాత రెండవ పంటగా రబీలో వేసిన కంది పైర్లు బాగా ఏపుగా పెరిగాయి. పురుగు మందులు పిచికారీ చేసుకోడానికి అలాగే నీరు పెట్టుకోడానికి వీల్లేకుండా పైర్లున్నాయి. దీంతో పొలంలో రైతులు పాయలు తీయిస్తున్నారు. ఎకరాకు 10 నుంచి గరిష్ఠంగా 17 క్వింటాళ్ల దాకా కూడా దిగుబడులు వచ్చేలా రైతులు కష్టపడుతున్నారు. మార్చి నాటికి రబీ దిగుబడులు ఇళ్లకు చేరనున్నాయి. మాచర్ల, గురజాల నియోజకవర్గాలలోని 9 మండలాలలో 32 వేల ఎకరాలలో కంది సాగవుతోంది. ఈ ఏడాది దిగుబడులు గరిష్ఠంగా ఉండవచ్చని వ్యవసాయశాఖ అధికారులు కూడా అంచనా వేస్తున్నారు. ఎండలు కాస్తుండడంతో వాతావరణం పూర్తిగా పొడిగా అనుకూలంగా మారడంతో వచ్చిన కాపు వచ్చినట్లే నిలుపుకొనేందుకు రైతులు శ్రమిస్తున్నారు.

సాగులో నూతన ఒరవడి..

ఒకప్పుడు కంది పంట దిగుడులు ఎకరాకు 5 క్వింటాళ్లు మాత్రమే వచ్చేవి. ఇప్పుడు పరిస్థితి మారింది. ఖరీఫ్‌లో కంది సాగు చేస్తే వర్షాలకు కంది పూత రాలడం పురుగు ఉధృతి కూడా ఎక్కువగా ఉండడం వల్ల దిగుబడులపై అవి ప్రభావం చూపేవి. దీంతో రైతులు ట్రెండ్ మార్చారు. ఖరీఫ్‌కు బదులుగా రబీలోనే ఎక్కువగా కంది సాగు చేస్తున్నారు. అయితే వారానికి పదిరోజులకు భూమి రకాలను బట్టి నీటి తడులు ఇచ్చుకుంటూ సస్యరక్షణకు మంచి మందులు పిచికారీ చేస్తూ అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు శ్రమిస్తున్నారు. ఇది పల్నాడు ప్రాంత కంది సాగులో వచ్చిన నూతన ఒరవడి. పల్నాడు రైతులు వేసవిలో పత్తిసాగు చేసి ఏ విధంగా సాగును లాభదాయకం చేశారో అదే స్ఫూర్తితో పత్తి పీకిన తర్వాత రబీలో కంది వేసి మలి విడత కంది పంటను కూడా లాభదాయకం చేసుకుంటున్నారు.

ధర పతనంతో నిరాశలో రైతులు

అయితే రైతుల ఆశలపై ధర పతనం నిరాశను కలిగిస్తోంది. గత ఏడాది కందులు క్వింటా గరిష్ఠంగా బహిరంగ మార్కెట్‌లో రూ.12 వేల దాకా పలికాయి. రూ.8,500లకు అస్సలు తగ్గలేదు. కానీ ఈ ఏడాది బహిరంగ మార్కెట్లో క్వింటా రేటు రూ.6,300 మాత్రమే ప్రస్తుతం ఉంది. ప్రభుత్వ మద్దతు ధర రూ.7,700 ఉంది. మద్దతు ధర కంటే కూడా ధర పతనం కావడం రైతుల ఆశలపై నీళ్లు చల్లుతోంది. వాస్తవంగా ఈ ధరుంటే గిట్టుబాటు కూడా కాదు. కంది సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు ఎకరాకు రూ.50 వేల దాకా రైతులు పెట్టుబడులు పెడుతున్నారు. సస్యరక్షణకు కూడా అధికంగా శ్రమిస్తున్నారు.

దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి..



కారెంపూడి మండలంలో 3,500 ఎకరాలలో కంది సాగవుతోంది. పంటలు అన్నీ ఆశాజనకంగా ఉన్నాయి. మంచి కాపు దశలో పైర్లున్నాయి. రబీలో వేసిన కంది సగటు దిగుబడి ఎకరాకు 9 నుంచి 10 క్వింటాళ్లు అవుతాయని అంచనా. పూత వచ్చిన దగ్గర నుంచి భూమి రకాన్ని బట్టి 10, 15 రోజులకొక నీటి తడి ఇచ్చుకుంటూ రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చు. దీనికి తగినట్లే ధర ఉండే బాగుంటుంది. ధర లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

– బి.యలమందారెడ్డి, మండల వ్యవసాయశాఖ అధికారి, కారెంపూడి

గిట్టుబాటు ధర లేకుంటే కష్టమే..

పత్తి పంట అయిపోయాక రబీలో నాలుగెకరాలలో కంది పంట వేశా. పంట బాగానే ఉంది. ఎకరాకు 10 క్వింటాళ్ల దాకా అవుతాయని ఆశపడుతున్నాం. దీనికి తోడు ధర కూడా ఉంటేనే మాకు గిట్టుబాటు అయ్యేది. ప్రస్తుతం ధర క్వింటా రూ.6, 500 లోపే అంటున్నారు. ఇలా అయితే కష్టమే. రైతుకు మద్దతు ధర కల్పించాలి. లేకుంటే కష్టపడి పండించినా లాభం ఉండదు,

–ఎలిశెట్టి ఆంజనేయులు, కౌలు రైతు, ఒప్పిచర్ల

అభ్యంతరాలుంటే తెలపండి

మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు



మాచర్ల: రాష్ట్ర ప్రభుత్వం నూతన ఉత్తర్వుల మేరకు పట్టణంలోని ప్రజలకు సులభతరమైన బిల్డింగ్ ప్లాన్ అనుమతులను వెంటనే అందించేందుకు ప్లానింగ్ డెవలప్‌మెంట్‌ను వేగవంతం చేయటానికి ఇబ్బందిగా ఉన్న నిబంధనలను సరళీకృతం చేయటం జరిగిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ డి.వేణుబాబు కోరారు. శనివారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అర్బన్ ప్రాంతంలో 9మీ. కనీస వెడల్పును ప్రస్తుత భూమి మీద ఎంత వెడల్పు ఉన్నదో ఆ రోడ్డు వెడల్పును నేల, మొదటి, రెండవ అంతస్తును 10 మీటర్ల ఎత్తు వరకు బిల్డింగ్ ప్లాను అనుమతులు మంజూరు చేయటానికి ప్లానింగ్ అధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఐదు సర్కులేషన్ ప్లాన్ సుమారు 130–56 సెంట్లు సర్కులేషన్ ఏరియాను ప్లానింగ్ చేయటానికి అనుమతివ్వటం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి సచివాలయం, మున్సిపల్, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలలో నోటీసులు ఉంచామన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. ఏడురోజులలోపే అభ్యంతరాలు తెలియజేయాలని కోరారు.

మెనూ ప్రకారం భోజనం అందివ్వాలి



ఎండీఎం రికార్డులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి వి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె. సరోజినిదేవి

రెంటచింతల: బడుగుబలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థుల విద్యకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి వి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన మండలంలోని మంచికల్లు ఎంపీయూపీ పాఠశాలను ఎంపీడీఓ కె.సరోజినిదేవి, ఎంఈఓ–2 వై.శివనాగేశ్వరరావుతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు వండిన భోజనాన్ని రుచి చూసి, పాఠశాల రికార్డులను, విద్యార్థుల హాజరును వారు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందజేయాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులను ఏర్పాటు చేయాలన్నారు. ఈఓపీఆర్డీ సీహెచ్ శ్రీనివాసరావు, హెచ్‌ఎం నంబూరి వీర వసంతకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిని గోకులాల నిర్మాణానికి చేయూత...

మల్లవరం(రెంటచింతల): గ్రామాలలో పాడి రైతులకు మిని గోకులాలను నిర్మించుకునేందుకు ప్రభుత్వం 100 శాతం ఆర్థిక సహకారం అందజేస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి వి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని మల్లవరం గ్రామాలలో లబ్ధిదారుడు జి. బాబు నిర్మించుకున్న మిని గోకులంను ఆయన ఎంపీడీఓ సరోజినిదేవితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఒకొక్క మిని గోకులం నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.30 లక్షలు పూర్తిగా రాయితీ ఇస్తుందన్నారు. మండలం లోని 11 గ్రామాలకు మొత్తం 25 మినిగోకులాలు మంజూరుకాగా ఒక్క రెంటచింతల గ్రామానికే 11 మిని గోకులాలు కేటాయించడం జరిగిందన్నారు. ఏపీఓ జయ చంద్రకుమార్, ఈసీ నాగరాజు, సర్పంచ్, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం..

మాచర్ల రూరల్: ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల శాతాన్ని పెంచి వారికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సక్రమంగా అందేలా విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు పనిచేయాలని స్పెషలాఫీసర్ గబ్రూ నాయక్ కోరారు. శనివారం మండలంలోని ఎంపీపీ పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ–2 అల్లి సురేష్, హెచ్‌ఎం ప్రశాంతి, ఉపాధ్యాయులున్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



దాచేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న దృశ్యం



రెంటచింతలలో ర్యాలీ నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ పిన్నం బ్రహ్మయ్య



మాచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



గురజాలలో నూతన ఓటర్‌కు ఓటు కార్డు అందిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్, కమిషనర్



ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన బహుమతిని అందిస్తున్న ప్రిన్సిపాల్ కిషోర్ బాబు తదితరులు

మాచర్ల: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని మాచర్ల తహసీల్దార్ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు, ఎంఈఓలు జఫ్రుల్లా ఖాన్, అల్లి సురేష్‌ల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. శనివారం ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులు ఓటర్ల దినోత్సవం గురించి తహసీల్దార్, కమిషనర్‌ల ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. అనంతరం పట్టణంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి, అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా నిలబడి ప్రతిజ్ఞను నిర్వహించారు. ఉపాధ్యాయులు, అధికారులు, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు దినోత్సవం పోటీల్లో బహుమతులు..

గురజాల : ఓటు హక్కు సద్వియోగం ప్రతి ఒక్కరి బాధ్యత అని వాగ్దేవి విద్యాసంస్థల డైరెక్టర్ ఉల్లి సుబ్బారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శనివారం జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన విద్యార్థుల అదనపు పాఠ్యాంశాల పోటీల్లో వాగ్దేవి సంస్థలకు చెందిన హైమావతి, వి.నిషాంత్‌రెడ్డిలు ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కిషోర్ బాబు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. శేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రెంటచింతలలో...

రెంటచింతల: ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధుల తలరాతలను మార్చే వజ్రా యుధమే ఓటు అని డిప్యూటీ తహసీల్దార్ పిన్నం బ్రహ్మయ్య అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి రెవెన్యూ అధికారులు, సచివాలయం సిబ్బంది, బీఎల్‌ఓలతో కలిసి గ్రామ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఆర్‌ఐ పల్లా రామకృష్ణ, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం వంటిది: ఆర్డీఓ

గురజాల: ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని రెవెన్యూ డివిజన్ అధికారి మురళీకృష్ణ అన్నారు. నగర పంచాయతిలో జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయం వద్ద నుంచి పురవీధుల్లో ర్యాలీగా నిర్వహించి బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం నూతన ఓటర్లుకు ఓటర్ కార్డులు పంపిణీ చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ నూతనంగా ఓటు హక్కు కలిగినవారు మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. నూతన ఓటర్లుకు ఓటు కార్డులను అందించారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్‌లను ఘనంగా సత్కరించారు. తహశీల్దార్ కె.నగేష్, నగర పంచాయతీ కమిషనర్ వైవీఎస్ శివన్నారాయణ, తదితరులున్నారు.

కేఎస్‌ఆర్ విద్యాసంస్థల్లో...

పిడుగురాళ్ల: సమాజ స్థితిగతులను మార్చే శక్తి ఒక్క ఓటుకే ఉందని కళాశాల డైరెక్టర్ కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్‌రావులు అన్నారు. పట్టణంలోని కొండమోడులోని కేఎస్‌ఆర్ విద్యాసంస్థల్లో జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు సాధినేని నరసింహారావు, డి.సురేష్, సీహెచ్ శ్రీనివాసరావు, జె. రామాంజనేయులు, ఎం.సోమశేఖర్, కోనేటి ప్రసన్న, బి. ఇందు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లిలో...

దాచేపల్లి: ఓటు ఉన్న ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని, ఓటు హక్కు వినియోగం ద్వారా బాధ్యత పెరుగుతుందని కమిషనర్ ఎంవీ. అప్పారావు అన్నారు. ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్‌ని సన్మానించారు. అదేవిధంగా నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గామాలపాడు సాగర్ సిమెంట్స్ ప్రాంగణంలో ఓటరు దినోత్సవం జరిపి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ అప్పారావు, డిప్యూటీ తహసీల్దార్ రాజా, ఎంపీడీవో రత్నం, ఏపీఎం రవి పాల్గొన్నారు.

మాచవరంలో...

మాచవరం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పలువురు వక్తలు అన్నారు. మండల కేంద్రమైన మాచవరంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మాచవరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించటమే కాకుండా మానవహారంగా ఏర్పడి ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అధికారులు పాల్గొన్నారు.

గురుకుల బాలికల పాఠశాలలో..

విజయపురిసౌత్: స్థానిక బాలయోగి గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ మేరీమంజుల ఆధ్వర్యంలో నేషనల్ ఓటర్స్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మేరీ మంజుల మాట్లాడుతూ ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే సాధ్యమవుతుందన్నారు.అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల: ఓటుహక్కు వజ్రాయుధమని మున్సిపల్ ఏఈ రాఘవేంద్ర అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సీనియర్ ఓటర్లను మున్సిపల్ కార్యాలయ పరిధిలో ఉన్న సచివాలయ సిబ్బంది దుశ్శాలువాలతో సన్మానించారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో...

విజయపురిసౌత్: స్థానిక ఆంధ్రప్రదేశ్ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చౌదరి, సచివాలయ ఉద్యోగులు కలిసి ఓటరు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ చౌదరి ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. వీపీ సౌత్‌లో నివాసముంటున్న 88 ఏళ్ల వృద్ధురాలు సాతులూరి తిరుపతమ్మను శాలువాతో సత్కరించారు. డాక్టర్ ఎస్.కె మహమ్మద్ బాషా, డి.విజయ్ కుమార్, అధ్యాపక సిబ్బంది, రవి, గంగమ్మ, సూపర్‌వైజర్ మనోజ్ కుమార్, దుర్గాప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రశాంతి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్

మాచర్ల: గుడ్ మార్నింగ్ మాచర్ల పురపాలక సంఘం కార్యాక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు పలు వార్డులలో పర్యటించి, ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శనివారం తెల్లవారుజాము నుంచే ఆయన 17,18,19 వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయావార్డులలో మురుగు కాల్వలలో పేరుకుపోయిన సిల్ట్ తొలగించి, ప్రజల నుంచి వచ్చిన సమస్యలను స్వీకరించి పురపాలక సంఘ అధికారులను వెంటనే పరిష్కరించాలని సూచనలు చేశారు. ఆయా వార్డులలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ పి.రాజా తదితరులున్నారు. అన్న క్యాంటీన్ భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రైల్వే బ్రిడ్జి నిర్మాణం పరిశీలించిన అధికారులు



నూతనంగా నిర్మాణమైన బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీనివాసరావు

పిడుగురాళ్ల: రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయని వాహనదారులు బైపాస్ రైల్వే బ్రిడ్జిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని బైపాస్ రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... బైపాస్ రైల్వే బ్రిడ్జి నిర్మాణంలో ఉన్న అవాంతరాలను తొలగించి నిర్మాణాన్ని పూర్తి చేయటం జరిగిందన్నారు. పిడుగురాళ్ల పట్టణంలో ట్రాఫిక్ జఠిలంగా ఉంటుందని, బ్రిడ్జి నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యకు పూర్తి పరిష్కారం లభించిందన్నారు. ఆయన వెంట ఆర్‌అండ్‌బీ ఈఈ రాజానాయక్, ప్రాజెక్టు హెడ్ శ్రీకాంత్, ప్రాజెక్టు డిప్యూటీ హెడ్ ప్రసాద్, సీనియర్ మేనేజర్ ముఖేష్, క్యూబ్ హైవే సిబ్బంది, ఆర్‌అండ్‌బీ సిబ్బంది పాల్గొన్నారు.

వేగం కన్నా ప్రాణం మిన్న...

పిడుగురాళ్ల: వేగం కన్నా ప్రాణం మిన్న అన్న సూత్రాన్ని వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు గమనంలో ఉంచుకోవాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తుమ్మలచెరువు టోల్‌ప్లాజా వద్ద శనివారం ఏర్పాటు చేసిన రోడ్డు భద్రతా వారోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా వారోత్సవాలకు సంబంధించి, వాహనదారులకు డ్రైవింగ్ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను విడుదల చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, క్యూబ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రూరల్ ఎస్‌ఐగా పోపూరి రవిబాబు



మాచర్ల రూరల్: మాచర్ల రూరల్ ఎస్‌ఐగా పోపూరి రవిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రూరల్ సీఐ షేక్ నసీర్ బాషాని కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఈయన రేంజ్ వీఆర్ నుంచి బదిలీ పై ఇక్కడకు వచ్చారు. గతంలో చిత్తూరు జిల్లాలో ఎస్‌ఐగా పనిచేశారు. ఇప్పటివరకు పనిచేసిన ఎస్‌ఐ ఎం.నారాయణ వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. ఏఎస్‌ఐ షేక్ రఫి, పోలీసు సిబ్బంది అభినందించారు.

బావిలో వృద్ధురాలి మృతదేహం

గురజాల: బావిలో వృద్ధురాలి మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన మేదర సుందరమ్మ (80) గత మంగళవారం ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. గత కొద్ది రోజులుగా గురజాలలో శ్రీరాంపురం రోడ్డులో సంచరిస్తుందని స్థానికులు తెలిపారు. శనివారం ఉదయం దుర్వాసన వస్తుండటంతో స్థానికులు బావిలో చూడగా మృతదేహం దర్శనమిచ్చింది. మృతదేహాన్ని సుందరమ్మది గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సంఘటనా స్థలాన్ని సీఐ ఆవుల భాస్కర్, ఎస్‌ఐ వై.వినోద్‌కుమార్ తదితరులు పరిశీలించారు.

మహిమాన్వితురాలు మరియ తల్లి

రెంటచింతల: లోక రక్షకుడు ఏసుక్రీస్తుకు పవిత్రాత్మ వలన జన్మనిచ్చిన కన్య మరియతల్లి మహిమాన్వితురాలిగా ప్రపంచవ్యాప్తంగా కొనియాడబడుతుందని దాచేపల్లి విచారణ సహాయక గురువులు రెవ.ఫాదర్ కె.నిఖిల్ తేజ అన్నారు. స్థానిక కానుకమాత 175 వజ్రోత్సవ తిరుణాళ్ల వేడుకలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న నవదిన ప్రార్థనలలో భాగంగా శనివారం ఆరోగ్యమాత మందిరం వద్ద విచారణ గురువులు ఏరువ లూర్దుమర్రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమష్టి దివ్యబలిపూజను సమర్పించి ఫాదర్ నిఖిల్ తేజ మాట్లాడారు. బలి పూజలో కన్యా స్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.